# అదృష్టరేఖ

శీనయ్య చచ్చిపోయాడు.

రెండు సంవత్సరాలు మంచంలో ఉండి ఏమీ తినలేక, మింగలేక అమితం బాధపడి చనిపోయాడు.

అతడి మరణం ఎవరికీ కన్నీరు తెప్పించ లేదు.

"జీవుడు రెండేళ్లనుంచీ గిలగిల కొట్టుకొంటున్నాడు. ఇప్పుడు విముక్తి కలిగింది" అనుకున్నారు.

ఇప్పుడు అతడికి ఏబాధాలేదు. తెరచుకున్న నోరు మూతపడ్డది. మనిషి మెలికలు తిరిగి పోవటంలేదు. నిటారుగా పడుకున్నాడు.

అతడి గది ఒక మూలకున్నది. అక్కడి నుంచే అతడు కేకలు పెట్టటం- మూలగటం, అందరినీ పిలవటం, ఎవరూ తొంగి అయినా చూడకపోవటం, ఎవరూ వచ్చి చూడలేదని అతడి మనసు కుతకుత ఉడికిపోవటం, కేకలు పెద్దవి కావటం అన్నీ ఆగిపోయాయి.

అది తెల్లవారు ఝామున మూడుగంటలు.

అందరూ హాయిగా ఫ్యాన్లకింద చల్లగాలిలో నిద్రపోతున్నారు.

ఎవ్వరికీ తెలియకుండా అతడు తుది శ్వాస విడిచాడు.

తెల్లవారింది. అరుణోదయమయింది. అతడి నలుగురు కొడుకులూ లేచారు. ముఖాలు కడిగారు. భార్యలందించిన కాఫీ తాగేరు. దినపత్రికలోని కాగితాలను తలాఒకటి తీసుకుని చదువుకుంటున్నారు.

పిల్లలందరూ ఒక్కొక్కళ్లూ లేచి ముఖాలు కడగటం- కాఫీలు తాగటం- స్నానాలు చేసి పుస్తకాలు సర్దుకోవటం మొదలుపెట్టరు. స్కూళ్ళకు వెళ్లటానికి..

అందరూ ఎవరిపనుల్లో వాళ్ళు మునిగిపోయారు. ఉద్యోగాలు- టైమయి పోతున్నదన్న ఆరాటం.

ఆ యింట్లో ఒక మూగపిల్ల, పదిహేనేళ్ల లోపుది- శీనయ్య ఒక్కగానొక్క కూతురు మాత్రము ఆ గదిలోనే కన్నార్పకుండా శీనయ్య ముఖంలోకి చూస్తున్నది. ఆయన మూలగటం లేదెందుకని ఆదుర్దాతో ఆయన చెయ్యిపట్టి నాడి చూచింది. గుండెదగ్గర చెయ్యిపెట్టి కొట్టుకుంటున్నదేమోనని చూసింది. కాళ్ళు చేతులు పట్టి చూసింది.

దేహం చల్లబడి కట్టెలా బిగుసుకుపోయింది.

ఆమె పేరు సుందరి. పేరే కాదు మనిషికూడా అందంగా ఉంటుంది. ఆమెకు శీనయ్యలో కలిగిన మార్పును అన్నివిధాలుగా తనకు తెలిసినట్టు పరీక్ష చేసి. ఆ గదిలోనుంచి బైటికివచ్చి, పనివాళ్లతో చేతిసైగలు చేస్తూ, గుండె వైపు చూపించి, చేతిని పట్టి చూపిస్తూ ఏమీ వినబడటం లేదని చెప్తోంది.

వాళ్లు అర్థం చేసుకునేలోపల అన్నలకందరికీ చెప్పింది వాళ్ల గదుల్లోకి వెళ్ళి.

"ఏమిటో దానిగొడవ. ఈ మూగది ఏ కాస్తమార్పు వచ్చినా గొడవ చేస్తుంది. ఆయనకు నిద్రపట్టిందేమో! ఇల్లు నిశ్శబ్దంగా ఉంది. బహుశ మందులు పనిచేశాయేమో !

అందరూ ఆఫీసులకు వెళ్లే ప్రయత్నంలో ఉన్నారు. ఇంట్లో దినకృత్యాలు సాగిపోతున్నాయి.

సుందరి మాటలురాని మూగపిల్ల. కాని తెలివితేటలకు లోపం లేదు. ఇంటి పనులు ఎవరూ చెప్పకపోయినా వంక పెట్టలేనట్టుగా చేస్తుంది. తన గోడు ఎవరూ వినిపించుకోవటంలేదని నాలుగిళ్లవతల ఉన్న శీనయ్య బంధువు మాధవయ్య ఇంటికి పరుగెత్తింది.

తన పద్ధతిలో చేతిసైగలతో శీనయ్య పరిస్థితి చెప్పి ఆయనను రమ్మనీ వచ్చి చూడమనీ దణ్ణం పెట్టింది.

సుందరి వ్యక్తంచేసిన విధానం మాధవయ్యకు అర్థమైంది. బాల్యంనుంచి

ఆమెను చూస్తున్నవాడే. నలుగురు మగపిల్లల తరువాత పుట్టిన ఈ ఆడపిల్ల మూగదయిపోవటం శీనయ్యతోపాటు బాధపడినవాడే.

ఆమె ఏడుపు ఆవేదన చూసి పరిస్థితులనర్థం చేసుకుని, దిగ్గున లేచి, తువాల బుజానవేసుకుని "పదమ్మా నేను వచ్చిచూస్తాను.'' ఆమె వెంట బయలు దేరాడు.

అప్పటికి మగవాళ్లందరూ ఆఫీసులకు వెళ్లారు. పిల్లలు స్కూళ్ళకువెళ్లారు. ఉద్యోగాలుచేసే కోడళ్లు గబగబా నడిచి బస్సులందుకున్నారు. ఒక పెద్దకోడలు తన గదిలో ఏదో సర్దుకుంటున్నది.

మాధవయ్య తిన్నగా శీనయ్య గదిలోకి వెళ్ళాడు. పరిస్థితి చూశాడు. వెక్కి-వెక్కి ఏడుస్తున్న సుందరి కళ్లు తుడిచి, చాపతీసుకురమ్మన్నాడు. మన దేశాచారాన్ని బట్టి చాపమీద ఇద్దరూ పట్టుకుని పడుకోబెట్టి బట్ట కప్పారు.

మాధవయ్య గదిలోనుంచి బైటికి వచ్చి ''అమ్మాయీ, కాంతమ్మా. శీనయ్య ప్రాణంపోయి చాలా సేపయినట్టుంది. సుందరీ నేను చాపమీద పడుకోబెట్టాము. అందరూ-ఆఫీసులకు వెళ్ళారా?'' అడిగాడు.

''అవునండీ! అందరూ వెళ్ళిపోయారు.'' అన్నది 'అయితేఏమిటి'అన్నట్లు ముఖం పెట్టి.

"మగపిల్లలందరూ రావాలి. కోడళ్ళు కూడా ఇంట్లో ఉండాలి. అందరికీ ఈ కబురు అందాలి.''

''ఎట్లానండీ! మా యింట్లో టెలిఫోను లేదు. ఏంచేద్దాం?"

"మా పక్కయింటి నుంచి మీరు ఎప్పుడూ టెలిఫోన్లు చేసుకుంటూనే ఉంటారుగా? వచ్చి చెయ్యమ్మా! ఇప్పటికి ప్రాణంపోయి ఏ అయిదారు గంటలో అయి ఉంటుంది."

"మీకు సుందరి వచ్చి చెప్పిందా? అదొక పిచ్చిది. ఊరికే ఆదుర్దాపడి అందరినీ కంగారు పెడుతుంది. తను కంగారు పడుతుంది. పొద్దున్నే వాళ్ల ఈ చావు కబురుని ఫోన్లో చెప్పనిస్తారా?"

"ఎందుకు చెప్పనివ్వరు? ముఖ్యమైన కబురు- అత్యవసరమైన కబురు చెప్పనివ్వకుండా ఉండరు. వెళ్ళి చెప్పమ్మా?''

"ఏమోనండీ! నాకు భయం".

''అయితే వాళ్ళ ఆఫీసు నెంబర్లు కాగితమ్మీద రాసివ్వు. మీ తోడికోడళ్లవి కూడా ఇవ్వు. నేను చేస్తాను. అందరూ రావాలి" అన్నాడు, విసుగుదలతో ముఖం చిట్లించుకుని.

"నాకూ సరిగా తెలియదు. జ్ఞాపకం ఉన్నట్టు రాసిస్తాను. అయినా వాళ్ళందరూ ఉన్నప్పుడు బాగానే ఉన్నట్టున్నారు. లేకపోతే వాళ్లంతా వెళ్ళిపోతారా ఆఫీసులకు?" అనుకుంటూ నెంబర్లు రాసిచ్చింది.

మాధవయ్య వెళ్ళి అందరికీ టెలిఫోన్లు చెయ్యగానే కొడుకులూ కోడళ్ళూ వచ్చారు. ఈ సందడిచూసి ఇరుగు పొరుగులు వచ్చారు.

''మీరు ఆఫీసులకు వెళ్లేటప్పుడయినా మీ నాన్న గదిలోకి వెళ్ళి చూడలేదా? ఏ రాత్రివేళకో పోయిఉంటుంది ప్రాణం". మాధవయ్య బాధపడుతూ అన్నాడు.

"పొద్దున లేచినప్పటినుంచీ ఎవరిపనుల్లో వాళ్లు మునిగితేల్తారు. బస్సులందాలన్న తాపత్రయంలో ఉరుకు పరుగులు పెడితే తప్ప వేళకు చేరుకోలేం కద?'' అన్నారు కొడుకులు.

"ఆ మాటా నిజమే. కాని ఇంట్లో ఒక జబ్బుమనిషి ఉన్నప్పుడు ఎన్ని పనులున్నా చూస్తూఉండాలి. ఆయన ఎవరో కాదు- మిమ్మల్ని కన్నతండ్రి. చెమటోడ్చి సంపాదించి మిమ్మల్ని పెంచి పెద్దవాళ్ళను చేసిన తండ్రి. అందరికి పెద్దచదువులు చెప్పించి, దొరల్లాగ మిమ్మల్ని పైకి తీసుకువచ్చిన తండ్రి. ఆయనను చూడడం మీ ధర్మం.''

"డాక్టరు ఇంక మందులక్కర్లేదన్నాడు. ద్రవపదార్థం కూడా నోట్లోకి పోవటం లేదు. 'నేను వచ్చిచూసిచేసేదేమీ లేదన్నాడు''. ఇంక మేము చూడ్డమేగా? రాత్రి పడుకోబోయేటప్పుడు చూస్తునే ఉన్నాం. ఆఫీసులకు వెళ్లే ముందర చూస్తున్నాం. చూసి చేసేదేముంది చెప్పండి. ఆ జబ్బు తిరుగులేనిది.

హాస్పిటల్లో ఉంచాం. ఇంట్లో ఉంచి మందులిప్పించాం. రేడియమ్ ట్రీట్‌మెంటు సామాన్యంగా అయిందా? అదీ ఇప్పించాం. డాక్టర్లు చెప్పినదంతా చేశాం."

ఆ సమయంలో ఆ మాటలకు జవాబు తోచలేదు మాధవయ్యకు.

సుందరి శీనయ్య దగ్గర కూర్చొని కుమిలి కుమిలి ఏడుస్తున్నది.

"పాపం, చాలా బాధపడ్డాడు. ఒక రోజా రెండు రోజులా? రెండేళ్ళనుంచీ బాధపడుతున్నాడు!''

"ఆయన మంచితనం, నిదానం, వితరణబుద్ధి ఎందుకూ పనికిరాలేదు.''

"మగపిల్లలు బాగా చదువుకుని ఉద్యోగాలుచేస్తున్నారు. వాళ్ళ కుటుంబాలతో సుఖంగా ఉన్నారు. పాపం ఈ సుందరి గతిఏమిటి? ఇంత అందమిచ్చిన దేవుడు ఆనోరు ఒక్కటీ ఇవ్వలేకపోయినాడు. తల్లి లేనేలేదు. ఉన్న తండ్రి పోయాడు. ఈ పిల్లగతేమిటి రేపు?''

"ఏముంది? నీదగ్గర ఉంచుకో అంటే నీదగ్గర ఉంచుకోమని! అన్నలు వంతులాడుకుంటారు. ఎక్కడ ఉన్నా ఇంటెడు చాకిరి చిన్నపిల్లయినా చేస్తుంది. ఎట్లాగో బతుకుతుంది. వదినెలచేతికింద మాటలు పడుతూ దెబ్బలుతింటూ.''

అందరూ తలా ఒకమాట అనుకుంటున్నారు.

''ఎందుకు వృథాగా కాలం గడపటం? అగ్నిసంస్కారం కావాలి కదా? ఏర్పాట్లు చెయ్యండి" అన్నాడు మాధవయ్య.

ఇరుగు పొరుగులు లేచి అంతా తలా ఒకపని చేశారు. శీనయ్య దేహం అగ్నికి ఆహుతి అయిపోయింది.

సుందరికి అయోమయంగా ఉంది. తనకింక తండ్రి లేడు ఇంక దిక్కు ఎవరు? ఈ యింట్లో ఎంతచాకిరిచేసినా మెచ్చేవారులేరు. 'అన్నం తిన్నవా? స్నానంచేశావా?' అని ఆత్మీయంగా కాకపోయినా మాటవరసకయినా అడిగేవారులేరు. ఆ మాధవయ్యే వస్తూపోతూ అడుగుతాడు. మనసులో ఉన్నదంతా చెప్పుకోవటానికి నోరులేదు తనకు.

తండ్రిపోయిన తరువాత ఆమెలో స్తబ్ధత పెరిగిపోయింది. ఎక్కడ కూర్చుంటే అక్కడే. అన్నంనీళ్ళులేవు. కాని కన్నీరుమాత్రం ప్రవాహంలా ఉంది.

శీనయ్య చనిపోయినప్పటినుంచీ కొడుకులందరిదీ మనసుల్లో మెదుల్తునే ఉన్నది సుందరివిషయం. ఆ విషయం కొందరికి ఒక భయంకరమైన సమస్యగా కనబడుతున్నది.

ఆ చక్కని ముఖం చిక్కిపోయింది. తండ్రిపోయిన దుఃఖంఒకటి-ఆహారం లేని కారణం మరొకటి. అన్నలందరూ కలిసి తననేమిచేస్తారోనన్న ఆదుర్దా ఇంకొకటి ఆమెను నీరసపెట్టేసి వేస్తే తూలి కిందబడేస్థితికి తీసుకువచ్చాయి.

దినవారాలయిన తరువాత మాధవయ్య శీనయ్య ఆప్తమిత్రుడుగా ఒక విధంగా ఆయింటి పెద్దరికాన్ని నెత్తిన వేసుకున్నట్టు అన్నాడు. "మీరందరూ చదువుకుని ఉద్యోగాలు చేసుకుంటున్నారు. పాపమాసుందరిది చిన్నవయసు - అందులో మూగది. దానిసంగతి ఇంతకాలం ఆయనే చూసుకున్నాడు. ఇకముందు దాని బాధ్యత ఎవరు వహిస్తారు ? దానిగతి ఏమిటి ?"అని ప్రశ్నించాడు.

"ఏముంది ? నాన్నవిల్లులో ఏంరాశాడో వకీలు నడిగితే తెలుస్తుంది. మాసంగతేంచేశాడో ? ఎవరికి ఏమేమి రాశాడోవిల్లులో ? వకీలుకు ఫోనుచేస్తే ఊళ్లో లేడని తెలిసింది" అన్నాడు పెద్దకొడుకు.

"అసలాయనకు ఈ సంగతి తెలిసిందా ?"

''నేను ఆఫీసునుంచే ఫోనులో చెప్పాను 'అయ్యోపాపం ! చాలా బాధ పడ్డారు. ఆ కేన్సరువస్తే ఇక లాభంలేదనుకోవలసినమాటే సార్" అన్నాడు. ఆయన ఊరినుంచి వచ్చిన తరువాత అన్నిసంగతులూ బైటపడతాయి" అన్నాడు పెద్దకొడుకు.

రోజులు గడుస్తున్నాయి నీరసంగా. విల్లులో శీనయ్య ఏంరాశాడోనని వకీలుకోసం ఎదురుచూస్తున్నారు ఆత్రంతో కొడుకులూ.

భళ్లున తెల్లవారినట్టుగా వకీలు ఊరినుంచి వచ్చాడు. శీనయ్యకొడుకులు ఆఫీసుకు వెళ్లుతూ వస్తూ ఆయన ఇంటికివెళ్లి "ప్రయాణపు బడలికలో ఉన్నట్టున్నారు. రేపు కలుద్దాం లెండి'' అంటూ మరునాటికి సమావేశమవుదామని నిర్ధారించిచెప్పి ఇళ్లకు వచ్చారు.

ఎవరి ఆశలు వారివి ఎవరికోరికలు వారివి. 'ఇది నాకొస్తే బాగుంటుందని' 'అది నాకొస్తే బాగుంటుందని తెల్లవార్లూ కలలూ కలవరింతలూ అన్నదమ్ములకు.

శీనయ్యకు వాళ్ళు ఉంటున్న మేడకాక, పదిహేనెకరాల భూమిఉంది. ఈ పదిహేనెకరాల భూమిమీద ఆదాయాన్ని అతడు విడిగా ఉంచుతూ వచ్చాడు. అది మంచి పంటభూమి. ఈ భూమిని పిల్లలులేని మాధవయ్యపేర కొన్నాడు. ఈ మధ్య విడిగా ఉంచిన డబ్బును మాధవయ్య సుందరిపేర్లమీద ఫిక్సెడ్ డిపాజిట్లు కొని లాయరుగారి దగ్గర ఉంచుతూవచ్చాడు. అది మగపిల్లలకు తెలియని విషయం.

శీనయ్య ఒకనాడు పత్రికలో చదివాడు - "బొంబాయికి జర్మనీనుంచి ఒక డాక్టరు వచ్చి, మూగపిల్లలకు గొంతులో ఆపరేషన్‌చేసి ప్లాస్టిక్ స్వరపేటికను ఓకల్‌కార్డ్సు అమర్చి మాట్లాడేట్టు చేస్తున్నాడు. ఆయన సంవత్సరానికి రెండు సార్లు బొంబాయి వచ్చి లేత వయసుగల మూగవాళ్లను ముందు పరీక్ష చేసి, ఎక్సురేతీసి, ప్లాస్టిక్ స్వర పేటికను ఓకల్‌కార్డ్సును అమర్చటానికి వీలయ్యేదీ లేనిదీ ముందుగానే తెలుసుకుంటాడట. వాళ్లకు ఆపరేషన్ చాలసేపు చేయవలసి వస్తుంది కనుక పుష్టికరమైన ఆహారమివ్వమని చెప్పి, స్వరపేటిక కొలతలను ఒకల్‌కార్డ్సుకొలతలను తీసుకువెళ్ళి అక్కడ తయారుచేయించి ఆరునెలల తరువాత ఆపరేషన్‌చేసి అమరుస్తాడట. అది గొంతులో సహజమైన స్వరపేటిక మాదిరి మిగతా భాగాలతో కలుసుకుని పనిచేయటానికి కొంతటైమ్ పడుతుందట. అంత వరకూ ఆయన సమక్షంలో హాస్పిటల్లోనే రోగిని ఉంచాలి. స్వరపేటిక ఓకల్ కార్డ్సు గొంతులో బాగా ఇమిడిపోయి, వేసినకుట్లుమాని రక్తప్రసరణ బాగా జరగడం మొదలైన తరువాత, ఒక్కొక్కమాటే పలకటం నేర్పుతారట. ఆయన హాస్పిటల్లోని అసిస్టెంట్లకు ఏ సమయంలో ఏమి చేయవలసిందీ చెప్పి జర్మనీ వెళ్ళి తను తిరిగి వచ్చేవరకూ రోగిని గురించిన సమాచారం ఎప్పటికప్పుడు ఫోనుచేసి తెలుసుకుంటూ ఉంటాడట. ఏ విధంగా డాక్టర్లు రోగిని చూడవలసిందీ అవసరమైన సమయాలలో ఫోనులో చెప్తాడట. ఆయన తిరిగివచ్చే వరకూ కొందరురోగులు మాటలునేర్చుకుని మాట్లాడుతూ ఉంటారట. డబ్బుగలవారికిది సువర్ణావకాశమని హాస్పిటల్ అధికారులు పత్రికాప్రకటన చేశారు. పనిని బట్టి ఫీజు నిర్ణయంచేయబడుతుందట. మొత్తం పదివేల డాలర్లలోపు ఆపరేషన్‌కి ఖర్చవుతుందని ప్రకటనలో ఉన్నది. డాలర్లధర ఎప్పటికప్పుడు మారుతూ ఉంటుంది. ఆపరేషన్ ఖర్చు కాక హాస్పిటల్లో ఉన్నందుకు ఖర్చు, బొంబాయి-

వంటి నగరంలో వెంటఉన్న వాళ్ళఖర్చు, అంతా అదీఇదీ కలుపుకుని సుమారుగా లక్షచేతిలో పెట్టుకోవాలి.

సుందరి నిజంగా అదృష్టవంతురాలయితే, ఈ కొత్తరకపు ఆపరేషన్‌తో మాట్లాడేశక్తిని సంపాదించుకుంటుంది. మాటవచ్చిన తరువాత చదువు పెళ్ళి అప్పుడు ఆలోచించుకొనవలసిన విషయాలు. సుందరికి అందరివలె జీవించటానికి తనకు చేతనయినంత అవకాశాన్నికల్పించాలి. అదే తండ్రిఅయిన శీనయ్యకోరిక.

తన పథకాన్నంతటిని మాధవయ్యకుచెప్పి వకీలుతో రహస్యంగా ఈ ఏర్పాటుచేశాడు. ఈ లోపల బొంబాయి హాస్పిటల్‌కి జర్మనీనుంచి డాక్టరు వచ్చినప్పుడు ఉత్తరంద్వారా విషయ సేకరణచేస్తూ వచ్చాడు, ఈ ఆపరేషన్ విషయము ఈ ముగ్గురి ఆంతరంగిక విషయం. ఇదంతా జరిగినప్పుడు సుందరికి పదమూడేళ్ళు నిండాయి.

ఇంతలోకి గొంతులో కేన్సరు వచ్చిందని శీనయ్యకు డాక్టరు పరీక్షచేసి చెప్పారు. హాస్పిటల్లోచేరి రేడియమ్ ట్రీట్‌మెంటు తీసుకుంటూకూడా మాధవయ్య చేత పంట అమ్మించటం ఫిక్సెడ్ డిపాజిట్లు తీసుకుని వకీలుగారి దగ్గరఉంచటం మొదలైనపనులు చేయిస్తునే ఉన్నాడు.

శీనయ్యని ఆ ఊరిలో అందరూ అలా పిలుస్తారుగాని అతడిపేరు శ్రీనివాసులు. రిజిస్ట్రార్ పనిచేసి పదవీవిరమణ చేసినవాడు. నెలనెలకు పెన్షను వస్తుంది. భార్య నగలన్నీ బ్యాంకులో లాకర్లో మాధవయ్య సుందరి పేర్లమీద పెట్టాడు. ఇది కూడా కొడుకులకు తెలియని విషయమే. కోడళ్లు వచ్చేసరికి అత్తగారు లేదు నగలసంగతి వాళ్లకుగాని కొడుకులకుగాని తెలియదు.

రెండు సంవత్సరాలు కేన్సరుతో తీసుకుంటున్న శీనయ్య దగ్గరికి మాధవయ్య ప్రతిరోజూ వచ్చేవాడు. ఈ విషయాలను గురించి మాధవయ్యతో మాట్లాడుతూ ఉండేవాడు చేతిలోచెయ్యి వేయించుకునేవాడు శీనయ్య.

"మాధవయ్యా ఈ సుందరి నీకూతురనుకో ఈ డబ్బంతా దానికోసం ఖర్చుపెట్టు దానికి నిజంగా మాటలువస్తే చనిపోయిన తల్లి అదృష్టమనుకో. చనిపోయినదానికి అదృష్టమేమిటంటావేమో ? సుందరి నలుగురి మాదిరిగా

సహజంగా జీవిస్తూఉంటే పైనుంచి చూస్తూ ఆమె సంతోషించదూ! నేను కూడా పైనుంచే సంతోషిస్తానేమో! ఇవన్నీ నా బంగారుకలలు. మాధవయ్యా! నీ దయా దాక్షిణ్యాలమీద నా కూతురి అదృష్టం ఆధారపడి ఉంది." అతడి రెండు చేతులూ తనచేతుల్లోకి తీసుకుని నుదుటకానించుకుని కన్నీరు కార్చాడు శీనయ్య.

ఇది జరిగిన మూడోనాడు శీనయ్య మరణించాడు.

సరిగ్గా నెలరోజుల క్రిందటే బొంబాయి హాస్పిటల్‌నుంచి మాధవయ్య పేరుమీద ఉత్తరం వచ్చింది - మరుసటి నెలలో డాక్టరుగారు జర్మనీ నుంచి వస్తున్నారనీ అమ్మాయిని తీసుకువచ్చి చూపించమనెను. ఆయన రెండునెలలు మాత్రమే ఉంటారట.

వకీలు ఊళ్లోకి వచ్చాడనగానే చీకటిపడినతరువాత మాధవయ్య వెళ్లాడు. ఆ మరునాడే కొడుకులకు ఆస్తి ఒప్పగించవలసిన రోజు. సుందరికి సంబంధించిన ఫిక్స్‌డ్ డిపాజిట్లను అన్నిటికీ తనకూడా తెచ్చాడు మాధవయ్య.

మరునాడు పంపకాలలో వాళ్లు ఉంటున్న మేడ, తాతలనాటి ఆస్తి పల్లెటూళ్లో ఉన్న ఎనిమిదెకరాలూ 'మీ కిష్టంవచ్చినట్టు పంచుకొమ్మ'ని ఉన్నట్టుగా వీలునామాను వకీలు చదివాడు. కొడుకులుకూడా చదివారు.

ఆ వీలునామాలో ఎక్కడా సుందరిపేరు లేదు. సుందరిని ఎవరు దగ్గరుంచుకొని పోషించాలో- పోషించినందుకు అదనంగా ఆస్తి ఏమయినా రాసేడేమోనని మళ్లీ మళ్లీ వీలునామా చదివారు. ఎక్కడా ఆమె ప్రసక్తే లేదు.

ఆ మరునాటినుంచీ వాళ్లందరూ విడిపోతారు.

సుందరి ఎక్కడుంటుంది?

మూడో వదినెగారికి రెండునెలల్లో పురుడు రానున్నది. కనుక సాదరంగా ఆ అన్నావదినెలు పిలిచారు. వాళ్లదగ్గరఉండి ఇంటిపనంతా నెత్తిన వేసుకుని చేసింది. నెల వెళ్లగానే రుసరుసలు ప్రారంభమయ్యాయి సుందరిని గురించి.

ఒకనాడు మాధవయ్య సుందరిని చూడటానికి వెళ్ళినప్పుడు వదినెగారు అన్నగారితో చెప్పి సాధిస్తున్నది. ''ఇంకెంతకాలం ఈ భారం మోస్తామ''ని.

అంతలో మాధవయ్యవచ్చి ''మీ అన్నగార్లు తీసుకువెళ్లరా'' అని అడిగాడు.

''వాళ్ళు రావటమే మానేశారు. నేనుమాత్రం భరించగలనా?" అన్నాడు. శీనయ్య మూడోకొడుకు.

"నేను పిలుస్తున్నానని వాళ్ళనుపిలు'' అన్నాడు మాధవయ్య.

అరగంటలో అందరూ సమావేశమయ్యారు.

అందరూ వచ్చిన తరువాత మాధవయ్య సుందరి సంగతి అడిగాడు.

''బాబాయీ ! కన్నతండ్రి విల్లులో ఒక్క అక్షరమైనా రాయలేదు. ఆయన ఉద్దేశ్యము మేము నలుగురం కలిసి పోషించాలనా ? మా నలుగురిలో ఏ ఒక్కరికయినా అదనంగా ఇంత ఆస్తి సుందరిని పోషించమని రాయవచ్చుగా ? ఆయనా ఉద్యోగం చేసినవాడే. ఈమాత్రం గ్రహించుకోలేకపోయాడు మానాన్న. నాదగ్గర ఉంచుకుందామంటే నా భార్య అడుగుతుంది 'మనకేం పట్టింద'ని. మిగతా వాళ్ల భార్యలూ అడుగుతారు. ఈ ప్రశ్నకు సమాధానం తోచటంలేదు" అన్నాడు.

"సరే మీ అందరు సుందరిని పోషించటానికి నీవా నేనా ననుకుంటున్నారు. సుందరిని నేను పెంచుకుంటాను. మాయింటికి పంపించెయ్యండి. అది మూగది. మాటలురావు. కాని పరిస్థితులను బాగా గ్రహించగలదు. మీకందరికి దాని బరువు బాధ్యతలు ఇంక ఉండవుగా ?" అన్నాడు. అందరి ముఖాలవంకా చూశాడు. అందరూ కొండంత బరువు తలమీదినుంచి తీసినట్టు ఊపిరి పీల్చుకున్నారు.

"అవసరం వచ్చినప్పుడు చెప్పాలనుకున్నాడు మీనాన్న. నేనూ అంతే ననుకున్నాను శీనయ్య మా పినతల్లి కొడుకు. నాకు పిల్లలులేరు. నా భార్యపోయిన తరువాత నేను మళ్ళీ వివాహం చేసుకోలేదు. తన యింట్లో వచ్చి ఉండమన్నాడు మీనాన్న.

''వద్దులే నాకు ఇల్లుంది. వండుకుంటాను తింటానన్నాను". రోజూ కలుసుకునే వాళ్ళం. నాతో పంపించెయ్యండి సుందరిని" అన్నాడు.

"తీసుకెళ్ళండి. దానికేమయినా సామాన్లా సరుకులా ? మారు బట్టలేగా. చేత్తో పట్టుకుని తెచ్చుకుంటుంది."

అప్పటికే సుందరి తనబట్టలు మడతచేసి చేతిలో పట్టుకుని మాధవయ్య దగ్గరకొచ్చి నిలబడ్డది.

''మాయింటికి వెళ్దామా !" అని మాధవయ్య పిలవగానే తలఊపుతూ వెంటవెళ్ళింది.

మాధవయ్య బొంబాయి ప్రయాణానికి అన్నదమ్ముల తగాదాలు ఉపకరించాయి. తన యిల్లూ పొలం బేరంపెట్టి సుందరిని తీసుకుని బొంబాయి వెళ్ళాడు.

స్టేషన్‌లోనే కాఫీ, టిఫిన్లు తీసుకుని హాస్పిటల్‌కి వెళ్ళారు. జర్మనీనుంచి వచ్చిన డాక్టరు అప్పుడే తన గదిలోకి వచ్చాడు. సుందరినీ, మాధవయ్యనూ గదిలోకి పిలిచాడు.

డాక్టరు చిన్నవాడు. ముప్ఫైఏళ్ళలోపు.

సుందరినిచూసి ఆమెను గురించి చెప్పమని మాధవయ్య నడిగాడు.

సుందరికి పదిహేనేళ్ళు నిండుతాయని ఆమె మూగపిల్ల అని చెప్పాడు మాధవయ్య.

"ఈమెను గురించేనా మీరు ఉత్తరం రాసింది ?"

''అవును"

"రండి ఆమెను పరీక్షచేసి ఎక్సరే తీసిచూస్తాను''. అని ఎక్సరే డిపార్టుమెంటుకు తీసుకువెళ్ళాడు. అక్కడ ఎక్సరే ఏఏ భాగాలకు తియ్యాలో చూపించాడు. వాళ్లు తీశారు.

ఎక్సరే చూడగానే డాక్టరు వాళ్ళిద్దరినీ తీసుకుని తన గదిలోకి వచ్చాడు.

"ఈమెకు బాగాబలం పట్టే పదార్థాలు పెట్టండి. బాగా బలం రావాలి. ఇప్పుడు కొలతలు తీసుకునివెళ్ళి ఆపరికరాలను చేయించి నేను మళ్లీ ఆరునెలలకు వస్తాను. ఆపరేషను చేసి మాట్లాడేటట్లు చేస్తాను. ఇప్పుడు నాకు కన్సల్టేషన్ ఫీజు నూరురూపాయలు. ఆపరేషన్ చాలాసేపు చేయవలసి ఉంటుంది. అప్పుడు హాస్పిటల్ చార్జెస్‌కాక నాకు ఆపరేషను చేసినందుకు ఎక్కువ ఫీజు ఇవ్వవలసి ఉంటుంది. ఈ అమ్మాయి చాలా అందమైనది. మా దేశపు అందం ఇట్లా ఉండదు". అన్నాడు ఆమెనే చూస్తూ ఆసక్తితో.

''మాధవయ్య అయన అడిగిన ఫీజు యిస్తానని చెప్పి కాగితంమీద

రాయించుకుని "మేము మా ఊరికి వెళ్ళివస్తాము. మీరు చెప్పినట్టు మంచి ఆహారం ఇచ్చి తీసుకువస్తాను. ఆపరేషన్ అయిన తరువాత నేను ఈమెదగ్గర ఉండటానికి వీలుందా ?" అని అడిగాడు.

"ఉండవచ్చు ఈమెకేమీ భయంలేదు. నేనే స్వయంగా ఆపరేషన్ చేస్తాను. మాట తెప్పిస్తాను. కొంతకాలం ఇక్కడుండాలి''.

''ఉంటాము"

ఊరికి వచ్చినప్పటినుంచీ సుందరికి రెండుపూటల- పాలు, కూరగాయలు గుడ్లతో భోజనం పెట్టగానే రెండునెలలయ్యేసరికి సుందరి మనిషి మారిపోయింది. ఆరోగ్యం తొణికిసలాడే ముఖం— అసలే అందమైన పిల్ల దానికితోడు పుష్టికర మైన ఆహారంతో అందాల రాణిగా తయారయింది.

ఆరు నెలల తరువాత బొంబాయికి డాక్టరుగారు వచ్చారని ఉత్తరం వచ్చింది. మాధవయ్య ఈ ఆరునెలలకాలంలో తన యిల్లు సామానుతో సహా అమ్మివేశాడు. శీనయ్య ఇచ్చిన పొలం అమ్మేశాడు. ఇద్దరూ బట్టలు సర్దుకొని బొంబాయి వెళ్ళారు. ఎక్కడ ఉండాలో తెలియదు. ఊరూ మనుష్యులూ కొత్త. ఒకరూములో సామానుంచి, స్నానాలుచేసి టిఫిన్ తిని హాస్పిటల్ కి వెళ్ళారు.

వెళ్ళగానే సుందరిని హాస్పిటల్లో చేర్చుకున్నారు. మరునాడు ఆపరేషన్.

మరునాడు ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకు వెళ్ళారు ఆమెను. ఎప్పుడు మొదలు పెట్టారో తెలియదుగాని నాలుగు గంటలకుపైన అయినట్టు మాధవయ్య గడియారం తెలిపింది.

ఆమె గదిలోకి ఎవరూ రావద్దని ఆమెమత్తులో ఉందని డాక్టరుచెప్పి పంపాడు. మాధవయ్య ఆ దగ్గరున్న హొటల్లో భోజనంచేసి హాస్పిటల్లో అందరూ కూర్చున్నచోట కూర్చున్నాడు.

లోపల డాక్టర్లు దగ్గరఉండి ఆమెకు గొట్టాల ద్వారా గ్లూకోజు ఆహారం ఎక్కిస్తున్నారు. ఆ రాత్రి డాక్టరు హాస్పిటల్లోనే ఉండి ఆమెకు ఆహారం సరిగా అందుతున్నదో లేదోనని ఆమె పడుకున్నగదిలో కుర్చీమీద కూర్చు న్నాడు.

మరునాటి ఉదయం మాధవయ్యకు, చూడటానికి గదిలోకి రావచ్చని డాక్టరు చెప్పిపంపాడు.

"అపరేషను బాగా జరిగింది. నేను తీసుకు వచ్చిన ప్లాస్టిక్ స్వరపేటిక ఓకల్‌కార్డ్సును ఆ చుట్టుపక్కల భాగాలను చెక్కి అమర్చానని చెప్పాడు. ఆమెకు తప్పకుండా మాటలువస్తాయనీ తానుండే కాలంలో ఆమె మాటలు వినే వెళ్తానని చెప్పాడు. 'లోపలపుండు మానిన తరువాత భోజనం పెట్టవచ్చు' నని అన్నాడు.

డాక్టరు అందరి దగ్గర వసూలుచేసినట్టుకాకుండా మాటలు వచ్చిన తరువాత ఫీజు తీసుకుంటానన్నాడు. అతడు రోజూ తనకు వీలుఉన్నప్పుడల్లా వచ్చి ఆమెను చూస్తున్నాడు.

డాక్టరు తీసుకునే శ్రద్ధను గమనించి, హాస్పిటల్ స్టాఫంతా ఆశ్చర్యపడుతున్నారు. ఆమెను అతిజాగ్రత్తగా చూస్తున్నారు. అప్పుడప్పుడు ఎక్సురేలు తీస్తున్నారు.

గొంతులోపల ప్లాస్టిక్ స్వరపేటిక ఓకల్‌కార్డ్సు బాగా అమరి, సహజమైనదిగా ఎక్సురేలో కనబడుతున్నది. పరీక్షచేసిన తరువాత ఒక్కొక్కమాట అనిపించటానికి డాక్టరే మొదట ప్రయత్నించాడు. ఏ-బి-సి-డి అంటూ తను అని, ఆమెచేత అనిపించటానికి ప్రయత్నించాడు. ఆమె స్వరం చాలా హీనంగా వినబడటం మొదలుపెట్టింది. క్రమంగా స్వరం హెచ్చింది. ఎదటి వారి పెదవుల కదలికను అనుసరించి ఒక్కొక్క అక్షరమే అనటం ప్రారంభించింది. డాక్టరు లేనప్పుడు మాధవయ్య ఆమెదగ్గర కూర్చుని చిన్నచిన్నమాటలు అనిపించటం మొదలుపెట్టాడు. రోజుకు మొత్తమ్మీద అరగంటకంటె ఎక్కువ మాట్లాడించవద్దని డాక్టరు చెప్పాడు.

మాధవయ్యకు సుందరికి మాటలు వస్తున్నాయనగానే అమితానందం కలిగింది. తండ్రి ఆశించినట్లుగా మాటలు బాగా వచ్చిన తరువాత మంచివరుణ్ణి చూసి వివాహం చెయ్యాలన్న అభిప్రాయంతోచింది.

సుందరి మాట్లాడటానికి ప్రాక్టీసుచేస్తున్నది. డాక్టరు తన గదిలో ఉన్నంతవరకూ ఆమెకు ఉత్సాహంతో ఆయన చెప్పిన మాట వెంటనే అంటు

న్నది. ఆయనకూడా ఆమెకు స్వయంగా మాటలు ఆంగ్లభాషలో నేర్పుతున్నాడు. ఆహారం స్వయంగా నోటికందిస్తున్నాడు. ఆమె సౌందర్యంచూసి అతడు తబ్బిబ్బయిపోతున్నాడు

సుందరికి మాటలు పూర్తిగా రాకపోయినా డాక్టరుమీద అభిమానం ఆకర్షణ కలిగాయి. ఆయన చెప్పినమాటలు గబగబా నేర్చుకుంటున్నది. ఆమె నేర్చుకుంటున్నకొద్దీ అతడికి ఉత్సాహం కలుగుతున్నది. మధ్యమధ్య నవ్వులూ చిలిపి బెదిరింపులూ ప్రారంభమయ్యాయి.

మాధవయ్యకు సుందరికి తెలుగుమాటలు నేర్పటంలో కష్టం కలగలేదు. ఆమెకు ఇదివరకే విషయ పరిజ్ఞానమున్నది. అక్షరాలను నోటితో నేర్చుకోవటమే కనక తెలుగుభాష త్వరలో నేర్చుకుంటున్నది. ఆంగ్లభాష చెప్పటానికి డాక్టరు సకల ప్రయత్నాలూ చేస్తున్నాడు.

ఒకనాడు మాధవయ్య గదిలోకి వెళ్ళేసరికి డాక్టరు ఆమెముఖాన్ని రెండు చేతులలోకి తీసుకుని ఏదో అంటున్నాడు. మాధవయ్యను చూడగానే దూరంగా జరిగి- "నేను ఇక్కడ ఉన్నన్నాళ్లు మాటలు నేర్పుతాను. జర్మనీలో మాటలూ చదువూ నేర్పే స్పెషలిస్టులు ఉన్నారు. తీసుకువెళ్లమంటారా ?" అడిగాడు.

''డాక్టరుగారూ మాలో పెళ్ళికాని పిల్లను ఇంకొకళ్లతో ఎక్కడికీ పంపము" అన్నాడు.

"అయితే ఈ అమ్మాయి అందం నాకు చాలా నచ్చింది. నేను పెళ్లి చేసుకుంటాను'' అన్నాడు.

''మీకు పెళ్ళికాలేదా ?''

"ఇంకా చేసుకోలేదు. ఈ అమ్మాయిని చూసిన తరువాత పెళ్ళిచేసుకుందామనిపిస్తోంది. మీకేం అభ్యంతరం లేదుగా ?'' అన్నాడు.

''ఈ అమ్మాయి నా కూతురు. ఈమెతప్ప నాకెవరూ లేరు. నేను ఈ అమ్మాయిని విడిచిఉండలేను" అన్నాడు మాధవయ్య.

ఆయనకూ, సుందరిని డాక్టరే పెళ్ళిచేసుకుంటాననంటే సంతోషంగా ఉంది. మరి అమ్మాయి వెళ్ళిపోతే తనసంగతి? ఆ మాట అనుకుంటేనే కన్నీళ్లొస్తున్నాయి.

''ఈ అమ్మాయితోపాటు నేనూ వస్తాను. నేను ఏపనయినా చేసుకుని బ్రతుకుతాను. నన్ను కూడా తీసుకువెళ్లండి. మీకు ఇవ్వవలసిన ఫీజు నేను రూపాయలలో ఇస్తాను. మీరు డాలర్లలో మార్చుకోండి. అదీగాక ఈ అమ్మాయికి డబ్బున్నది. వాటినికూడా మార్చండి ఈమెతల్లి నగలు లాకర్లో ఉన్నాయి. నేను వెళ్లి తీసుకువస్తాను. డాక్టరుగారూ, ఈ అమ్మాయి తల్లిలేని పిల్ల. ఆప్యాయత అనేది ఎరుగదు. మీరు చాలా జాగ్రత్తగా చూసుకోవాలి" అన్నాడు

"నేను నెత్తిమీద పెట్టుకుని చూసుకుంటాను. మీరు ఊరినుంచి వచ్చిన తరువాత డబ్బు మారకం గురించి ఆలోచిద్దాం" అన్నాడు ఎంతో మురిపెంగా ఆమెను చూస్తూ.

"పెళ్ళి ఇక్కడా లేక మీ దేశంలోనా ?" అడిగాడు మాధవయ్య.

''మళ్ళీ మీదేశం అంటారేం ? మీరూ వస్తున్నారు కదా ! మన దేశమనండి. నేనెంతో అదృష్టవంతుడిని. ఇంత అందమైన అమ్మాయి నాకు భార్యగా లభించినందుకు. ఇంక నాకు ఫీజెందుకు? ఆమెకివ్వండి. మరొకమాట-నేను నాకు నచ్చిన పేరుపెట్టి పిలుస్తాను మీకిష్టమేనా ? అన్నాడు.

"ఇంక నా యిష్టాయిష్టాలేమిటి ? మీ యిద్దరి ఇష్టమే నాయిష్టం'' అంటూ నగలు మూడోనాటికి తెచ్చాడు. వాటిని పెట్టుకుని డాక్టరుగారికి చూపించమ్మా'' అనగానే వాటిని అలంకరించుకుని చూపించింది.

''ఓ! ఎంతబాగున్నావు డాల్ మాదిరిగా ! ఉండు నీవు నవ్వుతుంటే ఫోటో తియ్యాలనిపిస్తోంది" అంటూ కెమేరా తెచ్చాడు.

సుందరి జీవితంలో అనుకోకుండా అదృష్టరేఖ బయట పడినందుకు మాధవయ్య తనుకూడా సుందరి పక్కన నిలబడి ఫోటో తీయించుకున్నాడు.

(ఈ కథలో మూగవాళ్ళకు కంఠంలో ప్లాస్టిక్ స్వరపేటిక ఓకల్‌కార్డ్సు అమరిస్తే మాటలు రావచ్చునని ఒక డాక్టరు జర్మనీలో ప్రయత్నించి ఒకరిద్దరి విషయంలో విజయం సాధించాడని షికాగోనగరంలో న్యూస్‌వీక్ ప్రకటించింది. దానిని చదివి రాసిన కథ).